క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 9, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 37, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 35, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 21, చామగడ్డ 60, మొరంగడ్డ 23, కందగడ్డ 26, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

5న పది విద్యార్థులకు గణిత నమూనా పరీక్ష

బన్సీలాల్‌పేట్: పదవ తరగతి విద్యార్థుల కోసం ఈ నెల 5న ఆదివారం గణిత నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు పద్మారావునగర్‌లోని శ్రీసాయి విజ్ఞాన భారతి కళాశాల ప్రిన్సిపల్ రమాదేవీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆయా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులన్నారు. మూడు గంటల పాటు ఉండే ఈ పరీక్ష ఎస్‌ఎస్‌సీ బోర్డు నిర్వహించే పరీక్ష తరహా ఉంటుందని అధిక మార్కులు సాధించి తొలి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు నగదు బహుమతులను అందజేయడంతో పాటు పాఠశాలలకు అవార్డు ఇస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి తమ కళాశాలలో ఉచితంగా అడ్మిషన్లు అందించి ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు.

15న సెలవు దినంగా ప్రకటించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థులు కోరారు. గురువారం ఓయూ గెస్ట్ హౌజ్‌లో జరిగిన గిరిజన శక్తి విద్యార్థుల రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శరత్‌నాయక్ ఆధ్వర్యంలో పలు తీర్మానాలు చేశారు. 15న సెలవు, గురుకులాలకు సొంత భవనాలు, గిరిజన వర్సిటీ స్థాపన, ప్రత్యేక ఎస్టీ కమిషన్, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ చేయాలన్నారు.

వెంకన్నకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: జంతుశాస్త్రం విభాగంలో సూరారపు వెంకన్నకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జోగిజనపల్లి వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షణలో టాక్సీలాజికల్ అసెస్మెంట్ ఆఫ్ ఫ్లోరైడ్ ఇన్ మోడల్ ఆర్గనిజం అండ్ బయో రెమిడీయేషన్ యూజింగ్ నావెల్ బ్యాక్టీరియా స్పీసిస్ ఏరోనామాస్ కావే జేవీఆర్‌వీఎస్-6 అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు.

సర్టిఫికెట్ అందజేత

సికింద్రాబాద్: ప్రయాణికుల ఫిర్యాదులకు సత్వరమే స్పందించి చర్యలు తీసుకుంటున్నందుకు జీఆర్‌పీ సికింద్రాబాద్ హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావును రైల్వే ఎస్పీ షేక్ సలీమా ప్రశంసించారు. ఈ మేరకు ఆయనకు మెరిటోరియల్ సర్టిఫికెట్ అందజేశారు.

మర్యాదపూర్వక కలయిక



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌరపల్లి రమేష్ గురువారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు డివిజన్ల నాయకులతో కలిసి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా అహర్నిశలు పని చేస్తున్నామన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూసెమినార్ హాల్లో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఓయూ అధ్యాపకులు డాక్టర్ రామేశ్వరరావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఉన్నత విద్య పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ అందే సత్యం మాట్లాడారు. వర్సిటీలలో చాలా ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

దేశానికే తెలంగాణ దిక్సూచి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



కార్పొరేటర్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బాలానగర్ మండలానికి చెందిన 16 మందికి మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను గురువారం ఆయన వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని ఏ రాష్ట్రంలో లేవన్నారు. పేదింటి ఆడపడుచు పెళ్లికి ఆర్థిక సహాయం అందిస్తున్న దేశంలోని ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోని ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఆసరా పింఛన్ ద్వారా ప్రతినెలా ఆర్థిక సహాయం, గర్భిణులకు కేసీఆర్ కిట్ల ద్వారా రూ. 13 వేలు, రైతు బంధు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, శేఖర్, పురుషోత్తం, పాజిల్ పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు..

మినిస్టర్ రోడ్డులోని దక్కన్ మాల్ అగ్ని ప్రమాదం జరిగిన నాటి నుంచి తమకు అన్ని విధాలుగా అండగా నిలిచినందుకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను రాంగోపాల్‌పేట డివిజన్ కాచిబౌలి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. తమకు వసతి సౌకర్యంతో పాటు భోజనం, హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసి తమలో ధైర్యాన్ని నింపారన్నారు. దక్కన్ మాల్ భవనం కూల్చివేత సందర్భంగా పక్కనే ఉన్న ఇళ్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చొరవ చూపడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి..

బన్సీలాల్‌పేట్: స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు పేద మహిళల జీవితాల్లో వెలుగు నింపి ఆర్థికంగా అండగా ఉంటాయని మంత్రి తలసాని అన్నారు. సీసీనగర్ కమ్యూనిటీహాల్‌లో అశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 110 మంది మహిళలకు గురువారం మంత్రి సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. ఖాళీ సమయంలో ఇలాంటి శిక్షణ తీసుకున్నట్లయితే సదరు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయన్నారు. సమస్యలను అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే మహిళల జీవితాల్లో వెలుగు చూడగలమన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి పలు రకాల శిక్షణతో మహిళల ఆర్థిక పరిపుష్టికి తోడ్పాటునందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె. హేమలత, సంస్థ డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి..

సనత్‌నగర్: కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న తరుణంలో ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. ఎస్‌ఆర్ నగర్‌లోని మాగ్నస్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈసీజీ, ఎక్స్‌రేలాంటి నూతన రేడియోగ్రఫీ మిషనరీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాయామాలను తమ జీవితంలో దినచర్యగా మలుచుకోవాలన్నారు. ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లు నిరుపేదలకు సేవా దృక్పథంతో సేవలు అందించినప్పుడే పూర్తిస్థాయిలో మన్ననలను పొందుతారన్నారు. సేవాభావంతో వ్యవహరించాలన్నారు.

రెచ్చగొట్టేలా నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు..

సనత్‌నగర్: తాను చేయని వ్యాఖ్యలను చేసినట్లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటనను విడుదల చేశారు. ఇటీవల నారాయణగూడలోని చర్చిలో జరిగిన యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా తాను మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు చర్చి కమిటీల ప్రతినిధులు, పాస్టర్లు తమపై దాడులు జరుగుతున్నాయని తెలిపారన్నారు. ఆ సమావేశంలో ఏం మాట్లాడారు..ఎవరు మాట్లాడారో వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తప్పుడు వ్యాఖ్యలతో ప్రచారం చేయడం చాలా బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలు, మతాలకు సమాన గౌరవాన్ని కల్పిస్తుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో పండుగలను ఎంతో ఘనంగా జరుగుతున్నాయని చెప్పారు. కేవలం మతాల పేరుతో అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు.

ఆసరా పింఛన్లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కొల్లి నాగేశ్వర్‌రావు

అడ్డగుట్ట: ఆసరా పింఛన్లు వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు నెలలుగా పింఛన్లు రాకపోవడంతో ఎంతో మంది వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో సుమారుగా 15 లక్షల మంది పింఛన్లపై ఆధారపడి బతుకుతున్నారని వారికి అండగా నిలబడాల్సిన ప్రభుత్వం ఇంత వరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, రాజయ్య, పులిపాటి శ్రీనివాస్, ఆంజనేయులు, సైదులు పాల్గొన్నారు.

బాలకార్మికులకు విముక్తి

సికింద్రాబాద్: బలార్షా నుంచి సికింద్రాబాద్‌కు అక్రమంగా తరలించిన 26 మంది బాల కార్మికులను రైల్వే రక్షణ దళం పోలీసులు రక్షించారు. ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దెబస్మిత బెనర్జీ కథనం ప్రకారం.. నగరంలోని వివిధ కార్మాగారాల్లో పనిచేసేందుకు బలాషా నుంచి ఆరుగురు వ్యక్తులు బాలలను కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తీసుకుని వస్తున్నట్టు సమాచారం తెలుసుకుని ఆర్‌పీఎఫ్ పోలీసులు అప్రమత్తమయ్యారు.అన్ని స్టేషన్‌లలో పరిశీలన అనంతరం బాలలను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దింపారు. రక్షించిన బాలలను బీబీఏ ప్రతినిధులకు అప్పగించి రవాణాదారులపై కేసు నమోదు చేశామన్నారు.

గురుకుల సెట్ ఉచిత కోచింగ్ ప్రారంభం



పుస్తకాలను అందజేస్తున్న సురేందర్

పద్మారావునగర్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్ణానగర్ మేకల మండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంచుకొండ ఫౌండేషన్ ట్రస్టీ మంచుకొండ సురేందర్ ఆధ్వర్యంలో ఉచితంగా గురుకుల సెట్ కోచింగ్‌ను ప్రారంభించారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తామన్నారు. పేద విద్యార్థుల విద్యా, వికాసానికి తమ ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచుకొండ ఫౌండేషన్ ముందుకు వచ్చి ఉచితంగా శిక్షణనిప్పిస్తూ అన్ని విధాలా ఖర్చులు భరించడానికి ముందుకు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి ట్రస్టీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

రుణాలను అందించాలి



శృతి ఓజాతో చర్చిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: పొదుపు సంఘాల మహిళలకు రుణాలు త్వరగా అందించే విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. గురువారం జీహెచ్‌ఎంసీ (అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం) అదనపు కమిషనర్‌తో శృతి ఓజాతో హేమ సమావేశమయ్యారు. సంఘాలకు అందించాల్సిన రివాల్వింగ్ ఫండ్ జాప్యంలో జరుగుతున్న కారణంతో ఏర్పడుతున్న ఇబ్బందులను వివరించారు. పొదుపు సంఘాలుగా ఏర్పాటు కావడం, బ్యాంకు రుణాలకు దరఖాస్తులు చేసుకునే విధానంలోనూ అమలులో ఉన్న నిబంధనలు సడలించాలని కోరినట్టు కార్పొరేటర్ చెప్పారు.

ఓయూ డీన్లకు పీహెచ్‌డీ అభ్యర్థుల వినతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని విభాగాల వారీగా పీహెచ్‌డీ సీట్ల సంఖ్య, అర్హత సాధించిన విద్యార్థుల సంఖ్యను విడుదల చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆయా ఫ్యాకల్టీల డీన్లకు వినతి పత్రాలు సమర్పించారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించని విద్యార్థులు గురువారం వివిధ ఫ్యాకల్టీల డీన్లను కలిసి ఫలితాల తీరు పై చర్చించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. విభాగాల వారీగా డాటాను రహస్యంగా ఉంచడం వెనుక కుట్ర జరుగుతుందన్నారు. యూజీసీ పేరుతో వీసీ ప్రొ.రవీందర్ ఇష్టారాజ్యంగా పీహెచ్‌డీ అడ్మిషన్లను చేపడితే సహించేదిలేదని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అర్హత మార్కుల తగ్గించే వరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియను నిలిపివేయాలని లేకుంటే ఆందోళనలు కొనసాగిస్తామన్నారు.

డివిజన్ కమిటీ ఎన్నిక

అడ్డగుట్ట: భవన నిర్మాణ కార్మిక సంఘం డివిజన్ కమిటీని గురువారం సీపీఐ కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడిగా గౌరీ నాగరాజ్, కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి ఎల్లయ్య, కోశాధికారి అంజయ్య, ఉపాధ్యక్షులుగా జయరాజుతో పాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. అనంతరం, డివిజన్ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు భారత కమ్యూనిస్ట్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

ఈఎస్‌ఐ ఎంపానెల్ లిస్ట్‌లో వీఆర్ ఆస్పత్రి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని వీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఈఎస్‌ఐ ఎంపానెల్ లిస్ట్‌లో చేరిందని, ఈఎస్‌ఐ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలని ఎండీ నందకిశోర్ తెలిపారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈఎస్‌ఐ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ తమ ఆసుపత్రిలో సర్జరీలతో పాటు చికిత్స ఉచితంగా అందజేస్తామన్నారు. క్యాష్ లెస్ కార్డు సదుపాయాన్ని ఉపయోగించుకుని చికిత్స పొందవచ్చన్నారు. బోయిన్‌పల్లి పరిసర ప్రాంతాల్లో ఈ సదుపాయం కలిగిన ఏకైక ఆసుపత్రి తమదేనన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అందం.. సెల్ఫీలో బంధం

అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో గురువారం సినీనటి సలోని అశ్విని, మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్-22 లిఖితా యలమంచిలి సందడి చేశారు. సుచిత సర్కిల్‌లో మానేపల్లి జ్యువెలర్స్ తన ఆరో షోరూంను ఈ నెల 10న ప్రారంభించనున్న దృష్ట్యా నిర్వహించిన కార్యక్రమంలో అందాల భామలు అదిరేటి డ్రెస్సులతో ర్యాంప్‌పై మెరిశారు. – సనత్‌నగర్



వ్యక్తి అదృశ్యం

చిలకలగూడ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హరీష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలగూడ వెస్లీచర్చి ప్రాంతానికి చెందిన ఇప్పలపల్లి కృష్ణప్రసాద్ (59) స్థానికంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గత నెల 28న బయటకు వెళ్లిన కృష్ణప్రసాద్ ఎంతకీ రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వాళ్లతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు బలరామ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న నర్సయ్య

సికింద్రాబాద్: భువనేశ్వర్ నుంచి నుంచి సికింద్రాబాద్ మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని రైల్వే పోలీసులు రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్పీ ఏ.నర్సయ్య కథనం ప్రకారం.. జీఆర్‌పీ ఎస్‌ఐ డి.రమేష్ నేతృత్వంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లాకు చెందిన మణికాంత్ (21)ను అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా 12 కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. పోలీసుల విచారణలో భువనేశ్వర్ అటవీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సికింద్రాబాద్ చేరినట్టు చెప్పాడు. ఇక్కడి నుంచి పొరుగు రాష్ట్రాలకు తరలించేందుకు ప్లాట్‌ఫామ్‌పై తచ్చాడుతున్న మణికాంత్ పోలీసులకు పట్టుబడ్డాడు.

ఇరాక్ యువకుడికి అరుదైన శస్త్ర చికిత్స



సనత్‌నగర్: ఇరాక్‌కు చెందిన ఓ యువకుడికి కిమ్స్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. పుట్టుకతోనే కాళ్లు వంకర (దొడ్డి కాళ్లు)గా ఉన్న ఆ యువకుడికి అత్యాధునిక శస్త్రచికిత్సతో సరి చేశారు. గురువారం ఆస్పత్రి కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ కాషా వివరాలు వెల్లడించారు. ఇరాక్‌కు చెందిన సజ్జాద్ అమీన్ మత్రూద్ అల్ హస్నవి (20) దొడ్డి కాళ్ల సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌కు వచ్చాడు. రెండు మూడు నెలల వ్యవధిలోనే రెండుసార్లు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. దీనిని కంప్యూటర్ నేవిగేటెడ్ ఎక్స్‌టర్నల్ ఫిక్సేటర్‌గా పేర్కొంటారు. సంప్రదాయ పద్ధతుల్లో చేసే శస్త్ర చికిత్సల కన్నా వీటి వల్ల అత్యంత కచ్చితంగా చేయడానికి వీలవుతుంది. దీని ద్వారా కాళ్లు సాధారణ స్థితికి తిన్నగా వస్తాయి. ఒకవేళ శస్త్ర చికిత్స చేయకుంటే మోకాళ్లు అరిగిపోతాయి. వంకర కాళ్లకు శస్త్ర చికిత్స చేసేటప్పుడు కాలు పొట్టిగా అయిన సమస్యనూ ఒకేసారి పరిష్కరించినట్లు తెలిపారు. ఇప్పుడు సజ్జాద్ అమీన్ తన కాళ్లపై శరీర బరువును మోపుతూ నడవగలుగుతున్నాడన్నారు.

ఢిల్లీలో ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ



కేడెట్ల బృందంతో మహేశ్వర్

రసూల్‌పురా: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో సికింద్రాబాద్ గ్రూప్‌కు చెందిన జి. ప్రేమ్ కృతిక అత్యుత్తమ కేడెట్‌గా ఎంపికై ట్రోఫీ సాధించింది. సీనియర్ డివిజన్‌లో నావల్ వింగ్ విభాగంలో కేడెట్ అమోఘవర్ద్‌రాజ్ నాయుడు మూడవ స్థానం, వి. శివగణేష్, సీహెచ్ నితిన్‌సాయిలు జూనియర్ డివిజన్‌లో ఆర్మీ, నేవీ విభాగంలో నాల్గవ స్థానం నిలిచి న్యూఢిల్లీ కరియప్ప పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన పీఎం ర్యాలీలో నరేంద్ర మోదీ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి నగరానికి చేరుకున్న సందర్భంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కేడెట్ ప్రతిభ ట్రోఫీలను గురువారం ప్రదర్శించారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ పి. మహేశ్వర్ కేడెట్లను అభినందించారు.

'కాంగ్రెస్ విజయం ఖాయం'



ఆర్. వెంకట్రామిరెడ్డికి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

లాలాపేట: రాహుల్ గాంధీ చేపట్టిన 4000 కిలోమీటర్ల భారత్ జోడో యాత్రలో తెలంగాణ నుంచి పాల్గొన్న కాంగ్రెస్ సేవాదళ్ వర్కింగ్ చీఫ్ ఆర్ వెంకట్రామిరెడ్డి తదితరులు గురువారం హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. విజయవంతంగా యాత్రను పూర్తి చేసుకుని వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు అనూహ్య స్పందన లభించిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం ధీమా వ్యక్తం చేశారు. యాత్ర విజయవంతానికి సహకరించిన ప్రజలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు.

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి

సికింద్రాబాద్: రైలు ప్రయాణాల ద్వారా జరిగే బాలల అక్రమ రవాణాను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని వివిధ విభాగాల అధికారులు నిర్ణయించారు. గురువారం బాలల అక్రమ రవాణ, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నియంత్రించడం అంశాలపై సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రైల్వే, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసు అధికారులు, దివ్యదిశ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సమావేశాన్ని నిర్వహించారు. నగరంలోని రైల్వేస్టేషన్ల నుంచి జట్లుగా రాకపోకలు సాగిస్తున్న బాలల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. వివిధ రాష్ట్రాల నుంచి నగరంలోని రైల్వేస్టేషన్లకు చేరుతున్న బాలలను సంరక్షించడంతో పాటు రవాణా దారులకు గుర్తించి బాల కార్మికులను నగరానికి రప్పించుకుంటున్న కంపెనీల యజమానులపై కూడా కఠిన చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు జీబీఎస్ స్వామి, పీబీ రమణమూర్తి, లావణ్యలత, లచ్చిరెడ్డి, భరత్‌నాథ్, జీఆర్‌పీ డీఎస్పీ నర్సయ్య, ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను, దివ్యదిశ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇందిర, కిష్టయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సొంతూరు వెళ్తూ మృత్యుఒడికి

రైలులో నుంచి జారిపడి యువకుడి మృతి



ధర్మతేజ (ఫైల్)

సికింద్రాబాద్: తండ్రి ఆరోగ్యం బాగా లేదని తెలుసుకున్న యువకుడు రైలు ప్రమాదంలో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్‌ఐ డేవిడ్‌రాజు కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంకు చెందిన థూలిపూడి ధర్మతేజ (31) నగరంలో మేస్త్రీగా స్థిరపడ్డాడు. తండ్రి వల్లభరాయుడు ఆరోగ్యం బాగాలేదని సమాచారం అందడంతో గురువారం సొంతూరు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి భీమవరం రైలులో బయలుదేరిన ధర్మతేజ ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు.

దాడికి పాల్పడిన వ్యక్తికి 225 రోజుల జైలు



మహ్మద్ ఇషాక్

చిలకలగూడ: దాడికి పాల్పడిన ఓ వ్యక్తికి 225 రోజులు జైలుశిక్ష విధించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్ వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన మహ్మద్ ఇషాక్ (32) గతంలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు. ఈనెల 1న అకారణంగా పక్కింటి వాళ్లతో గొడవ పెట్టుకుని దాడిచేసి గాయపర్చడంతో స్థానికులను ఇబ్బందులు కలిగించారు. స్థానికులతో పాటు బాధితుని ఫిర్యాదు మేరకు మహ్మద్ ఇషాక్‌పై ఈ పెట్టీ కేసు నమోదు చేశారు. సికింద్రాబాద్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరు పర్చగా 180 రోజులు జైలుశిక్ష, రూ.1050 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోవడంతో మరో 45 రోజులు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆత్మహత్యకు యువతి యత్నం

రక్షించిన రైల్వే పోలీసులు



సికింద్రాబాద్: ఆత్మహత్య చేసుకునేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ఓ యువతిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు రక్షించారు. ఉద్యోగ ప్రయత్నంలో విఫలమై ఇతర కుటుంబ సమస్యల కారణంతో ఓ యువతి గురువారం రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కాజీపేట్ మార్గంలోని రైలు పట్టాల వద్దకు చేరుకుంటున్న సమయంలో రైల్వే పోలీసులు రక్షించి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులను అప్పగించారు.